# పర్యవేక్షణతో పకడ్బందీ సేవలు

సీసీ కెమెరా పర్యవేక్షణలో వైద్యం అందిస్తున్న వైద్యురాలు నాగమణి



- సీసీ కెమెరాల నిఘాలో ప్రజలకు మెరుగైన వైద్యం
- కంట్రోల్ రూం నుంచి ఉన్నతాధికారుల నజర్
- సేవలను అందుబాటులోకి తీసుకవచ్చిన ప్రభుత్వం
- 212 కెమెరాల ఏర్పాటు



డీఎంహెచ్‌వో కార్యాలయంలో సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు

మంచిర్యాల ఏసీసీ, నవంబర్ 9: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సరైన సమయంలో మెరుగైన వైద్యం ఉచితంగా అందించేందుకు ఎన్నో విధాలుగా కృషి చేస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానలు ఉండగా, వాటికి తోడుగా పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు, బస్తీ దవాఖానలను అందుబాటులోకి తీసుకవచ్చింది. రోగులకు అత్యంత చేరువలోనే వైద్యం అందిస్తున్నది. ఇక వీటన్నింటినీ పర్యవేక్షించేందుకు పీహెచ్‌సీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. దీంతో వైద్యులు, నర్సులు, ఇతర పారా మెడికల్ సిబ్బంది సకాలంలో దవాఖానలకు వెళ్లనున్నారు. వారి విధులపై ప్రత్యేకంగా ఓ కంట్రోల్ రూం ను ఏర్పాటు చేసి అక్కడి నుంచి మానిటరింగ్ చేస్తూ పర్యవేక్షిస్తున్నారు. హైదరాబాద్‌లో కోఠిలోని డీపీహెచ్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. నిఘా కోసమే కాకుండా నేరుగా సిబ్బంది తో మాట్లాడడానికి ఆడియో విజువల్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉన్న 17 పీహెచ్‌సీలు, 4 అర్బన్ హెల్త్ సెంటర్లు, 3 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో అవసరమున్న దాన్ని బట్టి మూడు, నాలుగు చొప్పున సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి సేవలను అందుబాటులోకి తీసుకవచ్చారు.

## 212 కెమెరాలతో పర్యవేక్షణ..

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న 17 ప్రాథమిక హెల్త్ సెంటర్లలో 51, నాలుగు యూపీహెచ్‌సీలల్లో 21 మొత్తంగా 72 కెమెరాలను రాష్ట్ర ప్రభుత్వం అందించింది. గతంలో ఇక్కడ పని చేసిన కలెక్టర్ భారతీ హోళికేరి 17 పీహెచ్‌సీలకు నాలుగు చొప్పున 68, నాలుగు యూపీహెచ్‌సీలకు నాలుగు చొప్పున 16, మూడు సీహెచ్‌సీలకు ఎనిమిది చొప్పున 24, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 32 మొత్తంగా 140కెమెరాలను ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 212 కెమెరాలు ఉన్నాయి. ఒక్కో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలకు ఏడు కెమెరాలను అమర్చారు. డాక్టర్ గది, ఫార్మసీ, ల్యాబ్, దవాఖాన పరిసర ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వీటికి తోడు వైఫై కనెక్షన్లను కూడా అనుసంధానం చేశారు. పీహెచ్‌సీల్లో వైద్యులు, వైద్య సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలి. వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలను అందించాలని, సిబ్బంది సమయపాలనపై కచ్చితమైన నిఘా ఉంటుందనే ఉద్ధేశ్యంతోనే ప్రభుత్వం సీసీ కెమెరాలను అందుబాటులోకి తీసుకవచ్చింది.

## పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల పాత్ర కీలకం..

పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు వచ్చే రోగులకు సరైన సమయంలో వైద్యం అందించడానికి, చిన్న పిల్లలకు అవసరమైన వ్యాక్సిన్లు వేయడానికి, ఇతర సాధారణ వైద్యం అందించడానికి పీహెచ్‌సీ ల పాత్ర ప్రత్యేక కీలకంగా ఉంటుంది. దాదాపు ప్రతి మండలానికి పీహెచ్‌సీ ఉంటుంది. పెద్ద మండలాలైతే రెండు పీహెచ్‌సీలు లేదా అర్బన్ హెల్త్ సెంటర్లు ఉంటాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్య సేవలను అందిస్తారు. సీజనల్ వ్యాధుల కాలంలో పీహెచ్‌సీలు ప్రత్యేక పాత్రను పోషిస్తాయి. అంటువ్యాధులు, అత్యవసరమైన వైద్యం అందించే సమయంలో ఇవి ఎంతో ఉపయోగపడుతాయి. ఇందులో ఒక ఎంబీబీఎస్ వైద్యుడు, నర్సులు, ఇతర సిబ్బంది ఉంటారు.

## కమాండ్ కంట్రోల్ రూం..

హైదరాబాద్ లో కోఠిలోని డీహెచ్ (ప్రజారోగ్య కార్యాలయం)లో అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన కమాండ్ కంట్రోల్ రూంను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడి నుంచే అన్ని పీహెచ్‌సీలకు అనుసంధానం చేశారు. కంట్రోల్ రూంలో భారి స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ఒకే సారి అన్ని పీహెచ్‌సీల వైద్యులతో నేరుగా మాట్లాడడానికి,



పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

అవసరైన అదేశాలను ఇవ్వడానికి మైక్‌ను, స్పీకర్ తోకూడిన సాంకేతికతను ఏర్పాటు చేశారు. అంటువ్యాధులు విజృంభిస్తే ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలతో మాట్లాడే వీలు కల్పించారు. అవసరమనుకుంటే జూమ్ మీటింగ్ కూడా నిర్వహిస్తారు. దీంతో పాటుగా డీఎంహెచ్‌వోతో లింక్‌ను అమర్చారు. డీఎంహెచ్‌వో కూడా వైద్యుల సేవలను అవసరమున్నపుడు పరిశీలిస్తారు.

### ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం..



పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా అక్కడ అందుబాటులో ఉన్న వైద్యుడు, సిబ్బంది విధులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఏదైనా అనుమానం వస్తే వెంటనే సిబ్బందిని అలర్ట్ చేస్తున్నాం. దీని ద్వారా అందరూ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారు. సరైన సమయంలో మారుమూల ప్రాంతాల రోగులకు వైద్యం అందుతున్నది.

-డా. జీ సుబ్బా రాయుడు, మంచిర్యాల డీఎంహెచ్‌వో

# వైద్య సేవలు సూపర్..

## భీమిని ఆరోగ్యం కేంద్రంలో సకల వసతులు

- మెరుగైన సదుపాయాలు కల్పించిన రాష్ట్ర సర్కారు
- కాన్పులు కూడా ఇక్కడే..కేసీఆర్ కిట్లు అందజేత



కేసీఆర్ కిట్ అందజేస్తున్న వైద్య సిబ్బంది

భీమిని, నవంబర్ 9: రాష్ట్రంలో వైద్యారోగ్య శాఖ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ దవాఖానాల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. గతంలో సర్కారు దవాఖానాకు వెళ్లాలంటే రోగులు భయపడేవారు. స్వరాష్ట్రంలో ప్రభుత్వ దవాఖానాల్లో మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి రావడంతో, ప్రజలంతా వైద్యం కోసం అక్కడికే వెళ్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'ప్రైవేటు వద్దు.. ప్రభుత్వ దవాఖాన ముద్దు' అనే స్థాయిలో మార్పు వచ్చింది. ఈ విధంగా వైద్యారోగ్య శాఖ ఎంత మెరుగైన సేవలందిస్తుందో అర్థం చేసుకోవచ్చు. నిత్యం ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షణ చేస్తుండడంతో క్షేత్రస్థాయి నుంచి వైద్యారోగ్య శాఖలో మెరుగైన ఫలితాలు కనిపిస్తున్నాయి. భీమిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 50 నుంచి 100 మంది వరక రోగులు వచ్చి వైద్యం పొందుతున్నారు. కాన్పుల కోసం వచ్చే మహిళల సంఖ్య కూడా పెరుగుతున్నది. భీమిని పీహెచ్‌సీలో 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 52 ప్రసవాలు నిర్వహించారు. గతంలో కంటే ప్రస్తుతం మెరుగైన సేవలతో పాటు నిత్యం డాక్టర్ల పర్యవేక్షణ ఉండడం, అందుబాటులో మందులు ఉండడం, దవాఖాన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడడంతో ప్రజలు, గర్భిణులు దవాఖానకు వచ్చి చికిత్స పొందుతున్నారు.

## కేసీఆర్ కిట్‌తో...

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్‌తో ప్రభుత్వ దవాఖానలో కాన్పుల కోసం వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నది. సర్కారు దవాఖానలో కాన్పులు చేయించుకుంటే కేసీఆర్ కిట్‌తో పాటు బాలింతల ఖర్చు కోసం రూ. 12 వేలు ఇస్తుండడంతో మెరుగైన ఫలితాలు కనిపిస్తున్నాయి. అలాగే గర్భిణుల ఆరోగ్యం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్నది. అలాగే 9 నెలల పాటు గర్భిణులకు కావాల్సిన మందులను కూడా ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్నది. అదే ప్రైవేటు దవాఖానలకు వెళ్తే లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తుండడంతో గర్భిణులు ప్రభుత్వ దవాఖానాలకు వెళ్లి కాన్పు చేయించుకుంటున్నారు. అలాగే ప్రసవానికి దవాఖానకు వెళ్లే ముందు, ఆ తర్వాత కాన్పు అనంతరం ఇంటికి వచ్చేటప్పుడు అమ్మ ఒడి 102 వాహనాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

### అందుబాటులో వైద్య సేవలు



పీహెచ్‌సీకి వచ్చే వారికి అందుబాటులో ఉండి సేవలందిస్తున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యచికిత్సలు నిర్వహిస్తున్నాం. దీంతో ప్రతి రోజు దవాఖానకు వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నది. మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు మందులను కూడా అందజేస్తున్నాం. అలాగే దవాఖానలోనే కాన్పులు చేస్తున్నాం. కేసీఆర్ కిట్‌ను అందిస్తున్నాం. ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నాం.

-కృష్ణ, భీమిని పీహెచ్‌సీ వైద్యాధికారి



భీమినిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



రక్తహీనత ఉన్న గర్భిణీలకు ఐరన్ సుక్రోజ్ ఎక్కిస్తున్న దృశ్యం